కథా కౌముది

# అప్పట్లో అమ్మ ఉత్తరం

శ్రీనివాస్ లింగం

ఓం

పిఠాపురం

01.11.1974

చి. షణ్ముఖను ఆశీర్వదించి వ్రాయునది

ఉభయకుశలోపరి, ఇక్కడ అంతా క్షేమము, అక్కడ నీవు, మీ మిత్రులు , మీ ఉపాధ్యాయులు క్షేమమని తలుస్తాను. తమ్ముడూ, నాన్నగారు, నేను క్షేమము.

నీ ఆరోగ్యం బాగుందా? వేళకు తింటున్నావా? మజ్జిగా అవీ బాగా తాగు, పళ్ళు తిను, చదువు సంగతి నేను చెప్పనక్కరలేదు, నీకే తెలుసు, స్నేహితులతో అల్లరి తిరుగుళ్ళు తిరగకు, జాగర్త.

నాన్నగారు రోజూ స్కూలు కి వెళ్ళి వస్తున్నారు. కాస్త చలి మొదలైంది. అన్నట్టు, పోయినసారి నీకు పంపిన గ్లాస్కో జుబ్బాలు ఇప్పుడువేసుకోకు. నీకు కూడా అక్కడ చలి మొదలైంది కదా! పోయినసారి మన తీర్థంలో కొన్న ఆ ఎర్ర రంగు గళ్ళ స్వెట్టరు బయటకు తీసి, ఓ సారి ఎండలో పెట్టి వాడటం మొదలుపెట్టు. శీతాకాలం మొదలౌతోందని, ఈ ఆదివారం దొడ్లో వేనీళ్ళకి, పొయ్యి ఇటుకలు పేరుస్తానన్నారు నాన్నగారు.

దసరా నవరాత్రులు  చాలా ఘనంగా జరిగాయి. అమ్మవారి అలంకరణ బ్రహ్మాండంగా ఉంది, ఈ సారి కూడా గంగాధర్ ఆర్కెస్ట్రా బాగా జరిగింద"ట", నాన్నగారు నన్ను  తీసుకెళ్ళలేదు, ఘంటశాల వారి పాటలు మారుమ్రోగాయ"ట". సురభి వాళ్ళు రెండు నాటకాలు వేసారు, శ్రీకృష్ణార్జున యుద్ధం , పార్వతీ కళ్యాణం, నన్ను ఒక నాటకానికి తీసుకెళ్ళారు. అలాగే, మన ఎదురింటి టైలరు సీతారామం మావయ్య హరికథ కూడా బాగా జరిగింద"ట". బళ్ళ వేషాలు, బుర్రకథలూ షరా మామూలే.

ఒక రోజు మేము కూడా రాత్రి పాదగయలో జరిగే అన్నదానమునకు వెళ్ళి భోజనం చేసి వచ్చాము. మేము వెళ్ళినప్పటి రోజు శ్రీపాద వారు పెట్టించారట. మహానుభావుడు, ఎప్పటిలాగానే దేనికీ వెనకాడకుండా పొట్టలు నిండి నాలుక "రుచుల" సుడులలో తిరిగేటట్టు పెట్టించారు. ఈసారి కాకినాడ కోటయ్య వాళ్ళ వంటవాళ్ళు వచ్చి వారి దైన కాజాలు చేసి వెళ్ళారు. ఇక ఎప్పటిలాగానే, మన ఓలేటి విశ్వనాథం మావయ్యే వంట చేయించారు. పనసపట్టు కూర, గోంగూర పచ్చడి, టమాటా పప్పు,  సాంబారూ, మాంచి పచ్చకర్పూర వాసనతో వేడివేడి గా చక్కెరపొంగలి, మన మావయ్య చేతి తో తాలింపు పెట్టిన వంకాయ పచ్చడి, పులిహోర, చల్లా వారి పాడి నుంచి వచ్చిన పాలతో చేసిన గడ్డ పెరుగు, ఒక టేమిటి, అన్నీనూ మహా రుచిగా ఉనాయి, అందునా అమ్మవారి ప్రసాదమేమో మరింత రుచి. పాపం నీకు ఇప్పుడూ ఇది చదువుతుంతే నోట్లో నీళ్ళూరుతున్నాయేమో. నువ్వు పండక్కి వచ్చినప్పుడు అన్ని చేసిపెడతానులే.

అన్నట్టు, మన టైలరు  వీరభద్రం దగ్గ ఉన్న కొలతలతో ఓ రెండు జతలు కుట్టించెస్తారు నాన్నగారు, మళ్ళీ అప్పటికి బాగా బిజీ ఐపోతాడు. ఆ కొలతలు బానే ఉన్నాయా? నువ్వు పండక్కి వచ్చేసరికి కొత్త బట్టలు రెడీగా ఉంటాయి కదా!

మన రిక్షా సూరిగాడికి, వాళ్ళ పిల్లలకూ దసరాకి బట్టలు పెట్టాము. అలానే కచేరిదగ్గర గుడిసె హోటలు రామలక్ష్మికి కూడా నాన్నగారు వెళ్ళి బట్టలు ఇచ్చి వచ్చారు.

మొన్న గుడికి వెళ్ళినప్పుడు మీ ఫ్రెండ్సు కలిసారు, నువ్వు పండక్కివస్తావని చెప్పగానే చాల సంబరపడ్డారు.

వద్దన్నా వినకుండా రామం దొడ్డప్ప మళ్ళీ నీ ఫీజు కి ఉపయోగపడుతుండని  మనియార్డరు పంపాడు. నిన్ననే పెద్ద వర్షం పడుతున్నా పోస్టుమాను రాఘవ మావయ్య ఇచ్చి వెళ్ళాడు, ఇంత వర్షంలో వచ్చావెందుకంటే , మనియార్డరు కదా పిల్లాడి కి ఫీజు కి వెంటనే పంపాలేమోనని వచ్చానన్నాడు.

ఎప్పటిలాగానే నాన్నగారు , ఓ పావలా ఇస్తే ఎంత మురిసి పోయాడో మావయ్య, "ఎందుకు బావగారూ?"  అని.

లస్కరు ఎదో పని మీద పిఠాపురం వస్తున్నాడని, మన రామబద్రపురం నుంచి కరణంగారు (అదే మన చిన్న తాతగారు)  తమలపాకుల మోదులు, అరటి గెలలూ పంపారు మన అందరికీ. చక్కెరకేళీల గెలని మన దూలానికి కట్టి, గోనెగుడ్డ కట్టారు నాన్నగారు, ఈ వారానికి బాగ ముగ్గుతాయేమో చూడాలి మరి.  తమ్ముడు, రోజుకొకసారి గోనెగుడ్డను పక్కకు జరిపి చూస్తాడు, పొద్దున్నే పూజారి గర్భ గుడిలో తెరను వేసి స్వామిని చూసినట్టు.

అన్నట్టు చెప్పడం మరిచాను, మొన్ననే రాజమండ్రీ దగ్గర బ్రిడ్జీ ఓపెన్ చేశారట, గమ్మత్తేమంటే, కింద రైళ్ళు , పైన బస్సులు, కార్లు వెళ్తాయట, ఎప్పుడు చూస్తామో, 10 వ తరగతి సప్లిమెంటరీ పరీక్షల స్పాటుకి నాన్న గారు ఏలూరు వెళ్ళి వచ్చారు, వచ్చేప్పుడు చూశారట, భలే బాగుందన్నారు. పాపం మన పాత బ్రిడ్జుకి దశ తగ్గినట్టే, ఎన్ని ప్రయాణాలు చూసిందో పాపం ఆ పిచ్చి బ్రిడ్జు.

సరస్వతికి, పోయిన వారమే లక్ష్మి పుట్టింది. ఇప్పుడిపుడే దాని అక్క పార్వతితో కలిసి బానే ఆడుకుంటోంది. ఈ మూడూ మన దొడ్డికే సందడి. వాటికి మంచి గంటలు దొరికితే తీసుకురా పాపం వేద్దాము మెడలో.

ఈసారి వర్షాలు చాలా గట్టిగా పడ్డాయి. ఎంత వర్షం పడ్డా, ఆ పక్క గొల్లపోలు దాటి వరద దూళ్ళసంతవరకూ వచ్చి ఆగిపోయిందట, ఈ పక్క చిత్రాడ వరకూ నే వరద. మనవూరికి రాదు, మరేమి మహిమో అమ్మ పురుహూతికాదేవిది.

తమ్ముడి చదువు అంతంతమాత్రంగానే ఉంది, నువ్వే వాడికి ఓ ఉత్తరం వ్రాయి బాగా చదువుకోమని. తమ్ముడు మాట ఎత్తితే గుర్తుకు వచ్చింది, పోయిన శనివారం సెకండు సాటర్డే కదా, బడి నుంచి వచ్చి మధ్యాహ్నం తమ్ముడు, మన పెద్దనాన్నగారి కిరణన్నయ్యానూ మధాహ్నం సైకిలు టైర్లు దొర్లిస్తూ రోడ్డు మీద నాన్నగారికి కనిపించారు, ఓ రెండు దెబ్బలు ఇద్దరికి వేసిపంపారు. ఏదో దోష పరిహారం చేసుకున్నట్లు , సాయత్రం కోటగుమ్మం దగ్గర సోమరాజు బండి దగ్గరనుంచి బెల్లం జిలేబి తెచ్చి పెట్టారనుకో.

వర్ధనమ్మగారని అప్పాయమ్మ బళ్ళో కొత్త టీచరు గారు వచ్చారట. వారిది గోదారి అవతల ఊరట.

ఈ వేసవికాలం కాస్త హాయిగా ఉంది మాకు. వెంకట్రావు మావ కాకినాడనుంచి ఓ సీలింగు ఫేను తీసుకొచ్చి బిగించాడు. అక్కా, చిన్నోడికి మరీ ఇబ్బందిగా ఉందికదా ఉక్కపోతతో అని.

ఐతే, అక్కడ కరెంటు కోతలు ఉన్నాయా? ఇక్కడా బానే ఉన్నాయి. బిల్లు తక్కువ వస్తోందని ఇంట్లో మొగవాళ్లకు మాత్రం ఇంత వేడిన్లోనూ చల్లగానే ఉంటోంది.

అమ్మమ్మ తాతగారు రోజూ నీగురించి అడుగుతారు, వేసవికాలంలో ఎప్పటిలానే అమ్మమ్మ కాస్త ఇబ్బంది పడింది. మన డాక్టరు రెడ్డి గారు రాత్రంతా అమ్మమ్మ దగ్గరే ఉన్నారు. సిలైను ఎక్కించారు, రెడ్డి గారికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలమూ, మన కుటుంబానికి చేసిన సేవ ఎంతని చెప్పగలం కదా.

మొన్ననే అప్పారావు వచ్చి కొబ్బరికాయలు అన్నీ దించి వెళ్ళాడు. మన నుయ్యి బావుంది. వర్షాకాలం అవ్వటం వల్ల చేద అక్కరలేకుండానే వంగి బిందితో నాన్నగారు నీళ్ళు తోడుతున్నారు. బయటకు వచ్చేస్తాయేమోనని భయంగా ఉంటుంది నాకప్పుడప్పుడూనూ.

బామ్మగారూ తాతగారూ అత్తా వాళ్ళింటికి విశాఖపట్టణం వెళ్ళారు. ఓ రెండువారాలలో వస్తారు. పాపం వెళ్ళే ముందే, చెట్టునుంచి రాలిన నేరేడు పళ్ళకి మట్టి ఎక్కడ అంటుతుందోనని రాత్రి పాత చీరలు పరచి చెట్టుకింద, పొద్దున్నే, అన్ని ఏరి తమ్ముడికని తెచ్చి ఇచ్చారు బామ్మ.

నీకు అక్కడ పోస్టాఫీసుకి ఎప్పుడూ వెళ్ళగలవో చెప్పే , ముదే నాన్నగారు మన పోస్టాఫీసునుంచి ట్రంకాలు బుక్ చేస్తారు. చానాళ్ళైంది మాట్లాడి, తమ్ముడు కూడా మారాము చేస్తున్నాడు నీతో మాట్లాడాలని .

అవునూ అడగడం మరిచాను, నా ఉత్తరాలు గూడ్సు ట్రైను లాగా, నాన్నగారి ఉత్తరాలు రైలు ఇంజను అంటావు కదా. పర్వాలేదా, వచ్చేసారికి మరి నా వ్రాతని కాస్త కత్తిరించనా.

ఈ మధ్యనే ఏదో పెద్ద బాంబు పరీక్ష చేసారట పోక్రాను అనే వూళ్ళో, ఏంటో మరి అది, అందరూ చెప్పుకుంటున్నారు, పేపర్లో కూడా పెద్ద పెద్ద వార్తలు వచ్చాయట.

మొన్ననే మన రామా టాకిసులో అల్లూరి సీతారామరాజు సినిమా మన ఊరు వచ్చింది, ఒకటే హడావిడి సినిమా హాలు దగ్గర, మేము కూడా వెళ్ళాము, ఓ ఒకటే హారతులు, బొట్లూ నూ సినిమా తెరకు. భలే ఉంది సినిమా, ఏవిటో స్కోపట, చాలా పెద్దగా ఉండి తెర మీద బొమ్మ. ఘంటశాల మాస్టారి పాట, కృష్ణగారి నటన అన్ని కలిపి భలే ఉన్నాయి, నువ్వు ఎప్పుడు చూడగలవో., కుదిరితే నన్ను ఇంకో సారి తీసుకెళ్ళమంటా నాన్నగారిని.

ఈ మధ్యనే బీరకాయ, పొట్లకాయ, దొండ కాయ పాదులు వేశాను. నువ్వు పండక్కి వచ్చేసరికి విరకాస్తాయిలే .

విజయవాడనుంచి ఎవరో వస్తుంటే, నాన్నగారు రేడియో తెప్పించారు, గదికడ్డంగా చాలా పొడుగు జాలీ లాంటిది ఏదో కట్టారు, అది కట్టకపోతే మాటలు రావట, ఇప్పుడూ నాకు కాస్త కాలక్షేపంగాఉంది. ఈ విధంగా మన ఇంటికి ఇద్దరు పెద్దలు ఈ ఏడాది వచ్చినట్టైంది, ఒకరు సీలింగు ఫేను, మరొకరు చేంతాడంత జాలీతో పెద్ద చక్క రేడియో.

పోయిన ఆదివారము రుబ్బురోలు జరుపుతుండగా ఓ పెద్ద జర్రి బైటకు వచ్చింది, ఈశ్వరుని దయతో కుట్టకుండా, మాకు చంపిన దోషము అంటకుండా అదే బయటకు పారిపోయింది.

సీతయ్యగారితోట వైపు రంగడు చిన్నాన్న వాళ్ళూ ఇల్లు చూశారట, నిన్ననే అడ్వాన్సు ఇచ్చాము, త్వరలోనే గృహప్రవేశానికి ముహూర్తం పెట్టించాలి వదినా అని చెప్పారు నిన్న చిన్నాన్న వచ్చి. మళ్ళీ మాకు గృహప్రవేశం హడావిడి ఉంటుంది. అప్పటికి బామ్మ గారూ వాళ్ళూ కూడా వచ్చేస్తారు, అత్తకూడా వాళ్ళతోనే వస్తారట, మావయగారూ, పిల్లలూ ఓ రోజు ముందు వస్తారట.

నువ్వు అంత దూరంగా ఉన్నా, నా ఈ గూడ్సురైలంత పొడవైన ఉత్తరాలతో ఇక్కడే ఉన్నట్టూ , ఇవన్నీ ప్రత్యక్షంగా చూస్తునట్టూ భావిస్తావనే ఇంత పెద్ద ఉత్తరాలు వ్రాస్తున్నాను. ఇంకా ఏమైనా విషయాలు మర్చిపోయినట్టు మళ్ళీ గుర్తుకు వస్తే మరొక లేఖ వ్రాస్తాను మళ్ళీ. కంగారు పడకు

జాగర్త నాన్నా.

ఉంటాను

ఈశ్వర కృపాకాటాక్షసిద్ధిరస్తు.

మీ అమ్మ

శ్రీ ఆనందనామ సంవత్సర ఆశ్వీయుజ బహుళ పాడ్యమి

★★★★★★

COMMENTS